# మాఘ మహాకవి యొక్క 'శిశుపాల వధ' మహాకావ్యంలో అనేక కవితా చమత్కారములు - పూర్వ భాగం

**Dr. Kasinadhuni Maheswara Prasad**

సంస్కృత పంచ మహాకావ్యములలో శిశుపాల వధ ఒక మహా కావ్యం. ఇది మాఘ భట్టారక ప్రణీతం. పండితులు దీన్ని మాఘ కావ్య మని కూడా అంటారు. సంస్కృత సాహిత్య రత్నాకరం లో ఇదొక అనర్ఘ రత్నం వంటిది. శిశుపాల వధ ఇతివృత్తానికి ఆధారం శ్రీమద్వ్యాస ప్రణీత మహాభారతమే. ఈ కథ భాగవతంలో కూడా కనిపిస్తుంది. శిశుపాల వధ మహాకావ్యాన్ని రచించిన మాఘ భట్టు ఔత్తరాదిక మహాకవి. చరిత్రను ఆధారంగా చేసుకుని చెప్పాలంటే, ప్రస్తుత గుజరాత్ రాష్ట్రంలో యున్న శ్రీమాల నగరం జన్మస్థలమని, ఏడవ శతాబ్దం వాడని చెప్పటం సత్యదూరం కాదు. ఒక కావ్యం మహాకావ్య మనబడా లంటే కనీసం పదునెనిమిది సర్గలతో, ఛందో వైవిధ్యంతో, అనేకప్రకృతి వర్ణనలతో కూడి, పర్వత, ఋతువర్ణనలు, సుమసౌరభము, పుష్పాపచయ, జలక్రీడా, ప్రభాత, సూర్యోదయ, సాయంకాల, చంద్రోదయ, మద్యపాన, సురత, క్రీడాభిరామం, కేళీ, వినోద, శయ్యాసన,వన విహార, ప్రయాణ, దౌత్య, మల్లయుద్ధ, చిత్రయుద్ధ వర్ణనలతో విస్తరించి యుండాలి.

ఇరవై సర్గలతో కూడిన శిశుపాలవధ మహాకావ్యంలో మాఘ భట్టు 1675 శ్లోకాలలో అపారమైన ఛందోవైవిధ్యంతో, అనేక కవితా చమత్కృతులతో ఈ పై వర్ణనలన్నీ రసవత్తరంగా చేశాడు. సత్యం శివం సుందరమ్మను ఆర్యోక్తికి ఈ వర్ణనలన్నీ సోదాహరణములు. మహాకావ్యానుగుణంగా సందర్భోచితమైన ధర్మోచిత వర్ణనలతోనూ, సాంగోపాంగంగానూ సర్గాంతం లో భావికథాంగ సూచనలతోబాటు, ముఖ్యంగా అనేక కవితా చమత్కారాలు శిశుపాల వధ లో చోటు చేసుకున్నాయి. మాఘ మహాకావ్యంలో సేనానివేశ, నాగరిక, సాగరిక, యమునా నది, నదీ నద నదీశ, సముద్ర భగవదవతార వర్ణనలు అధికంగా కనిపిస్తాయి. మాఘుడు వైష్ణవుడని ప్రతీతి. ఈ శిశుపాల వధ కావ్యంలో శ్రీకృష్ణభగవానుడు కథానాయకుడు. ప్రతినాయకుడు శిశుపాలుడు. ఇది వీర రస ప్రాధాన్యం. ఇందులో శృంగారకరుణాదులు అంగ రసాలు. శిశుపాల వధ మహాకావ్యం అనేకార్థిక, సాంఘిక, రాజకీయ శాస్త్రాలకేకాక, ఆయుర్వేద, ధనుర్వేద, గజాశ్వ విద్యా సంగీత వాణిజ్య శాస్త్రాలకు కూడ పారిచాయికగా రూపొందింది. ఒక విజ్ఞాన ఖనిజము. పాణిని వ్యాకరణసూత్రాలకొక సోదాహరణ పట్టిక. '*నవసర్గగతే మాఘే నవశబ్దో నవిద్యతే!*' – అంటే, మాఘకావ్యంలో తొమ్మిది సర్గలను చదివిన వ్యక్తికి ఇక సంస్కృతంలో అర్థం తెలియని పదమంటూ ఉండదట ! మాఘభట్టు తన ఈ మహా కావ్యంలో, తనకు పూర్వీకుడైన భారవిని అనూకరిస్తూ రసాన్ని, రామణీయకతతో బాటు గొప్ప వైదుష్యాన్ని తన కవితా శిల్పంలో చూపించాడు. మాఘ మహాకవి అత్యంత శీలవంతుడు, బలసంపన్నుడు, ఉదారుడు, శబ్ద శాస్త్రజ్ఞుడు, ప్రౌఢ కవి. ఓజోగుణ ప్రాధాన్యుడు.

**ఉపమా కాళిదాసస్య, భారవేరర్థగౌరవమ్ ।**

**దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయో గుణాః ॥**

అంటే, ఉపమాలంకారాలకు కాళిదాసు, అర్థగురుత్వమునకు భారవీ, గొప్ప పదలాలిత్య గుణానికి దండి లబ్ధప్రతిష్ఠులైతే, వీరిలో గల మూడు ప్రత్యేక గుణాలూ, ఒక్క మాఘమహాకవి రచనాశిల్పంలో చోటు చేసుకున్నాయి. ఒకానొక పండితుడొకసారి ఏమన్నాడంటే – '*మురారి పదచింతనాచేత్ తదా మాఘేరతిం కురు*'. మాఘే, అంటే మా + అఘే = పాపం చేయకుము సుమా ! శ్రీహరి పదచింతన చేయాలనుకుంటే మాఘ కావ్యంలో రతించుము. ఈ మహా కావ్యం సారస్వత సారం. చిత్తజాడ్యహరం. సంస్కృత కవితా పాండిత్యానికి నికషోపలం వంటిది.

ప్రస్తుత వ్యాసంలో, మాఘ మహా కవి యొక్క కవితా చమత్కృతులను కొన్నింటికి సోదాహరణంగా , శిశుపాల వధ మహాకావ్యంలో, 19 వ సర్గ నుంచి కొన్ని శ్లోకాలను పాఠకులతో పంచుకోవటానికి సాహసిస్తున్నాను. ద్వ్యర్థి, నిస్తాలవ్యములు, సర్వతో భద్ర వృత్తము, అర్థభ్రమకము, ఏకాక్షరీ వృత్తము, ఏకాక్షరీ పాద వృత్తం, ద్వ్యక్షరి, సముద్గయమకము, ప్రతిలోమానులోమపాద శ్లోకము, ప్రతిలోమానులోమ శ్లోకద్వయము, అర్థత్రయవాచికము, షడరర చక్రబంధము ఇత్యాద్యనేక కవితా చమత్కృతులకు ఈ శ్లోకములు సోదాహరణములు.

మహాకావ్యమునకు గల సార్థకతకు వలయు విలక్షణమైన ఉపక్రమోపసంహారాది కావ్యాంగములకు సోదాహరణములు గా కొన్ని శ్లోకములు గుర్తింప బడినవి. మహాకవి భారవి 'శ్రియఃకురూణాం' తో తన 'కిరాతార్జునీయ' మహాకావ్యాన్ని ప్రారంభిస్తే, మాఘ భట్టు తన '**శిశుపాల వధ**' మహా కావ్యాన్ని 'శ్రియఃపతి' అనే పదంతో ఆరంభిస్తూ మంగళాచరణం చేశాడు. ప్రతి సర్గ లోని చివరి శ్లోకం లో భారవి 'లక్ష్మీ' పదాన్ని లాంఛనంగా ప్రయోగిస్తే, మాఘుడు 'శ్రీ' శబ్దంతో శ్రీకారం చుట్టాడు. ఉపసంహారంగా *సత్త్వం మానవిశిష్టమాజిరభసా..* అన్న షడరర చక్రబంధము తో ఈ వ్యాసాన్ని ఉపసంహరించాను.

## *ఉపక్రమము - మంగళాచరణ శ్లోకము*

**శ్రియః పతిః శ్రీమతి శాసితుం జగ  జ్జగన్నివాసో వసుదేవ సద్మని ।**

**వసన్ దదర్శావతరన్తమంబరాత్  హిరణ్యగర్భాంగ భువం మునిం హరిః ॥ (1§1)**

తా. శ్రియః పతి లోకాన్ని శాసించడానికి శ్రీకృష్ణుడుగా నవతరించాడు. సకల సంపదలున్న వసుదేవునింట ఆయన నివసించాడు. ఒకనాడు దివినుండి భువికి దిగివస్తున్న నారద మునిని శ్రీకృష్ణుడు చూశాడు.

జగన్నివాసుడంటే నిఖిల లోకాలను తన కుక్షిలో నుంచుకున్న కుక్షింభరుడు. ఈ లోకాలను తాను సృష్టించి , అందు తను ప్రవేశించాడు. జగత్తునకే ఆధారమైన భగవంతునకు జగమే ఆధారమయిందా ?! అవును - '*తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్*' అనికదా వేదవచనం. *స చ భగవాన్ సృష్ట్వేదం జగత్ తస్య చ స్థితిం చికీర్షుః మరీచ్యాదీన్ అగ్రే సృష్ట్వా ప్రజాపతీన్ ప్రవృత్తి లక్షణం ధర్మం గ్రాహయామాస వేదోక్తం / హిరణ్య గర్భ స్సమవర్త తాగ్రే* ... అంటే సృష్టిని జేయటానికి అవ్యక్తమైన పరబ్రహ్మమునుంచి మొట్టమొదట వ్యక్తరూపుడైన చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించాడని అర్థం. *స్మర్యతే న చ దృశ్యతే*– స్మరించే వాడు జీవుడు, దర్శించే వాడు దేవుడు - అనే శృత్యర్థాన్ని '*దదర్శ*' అనే క్రియా పదం తెల్పుతుంది. ఈ ప్రారంభ శ్లోకంలో ని ఆదిమధ్యాంత పదాలైన '*శ్రియఃపతి*', 'హిరణ్యగర్భుడు', 'హరి' శాబ్దికంగా శ్రీకృష్ణుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడని సూచిస్తున్నాయి. *పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్* అను గీతా వాక్యానుసారంగా శిష్టరక్షణకూ, దుష్ట శిక్షణకూ అవతరించాడు శ్రీకృష్ణుడు. ఈ శ్లోకంలో చివరి పదం 'హరి'. ఇది చివరకు కావ్య ఫల మయిన శిశుపాల వధను సూచిస్తుంది. ఇంద్రుని సందేశార్థం గగన విహారం జేస్తున్న నారద మునిని శ్రీకృష్ణుడు సందర్శించడం కావ్య వస్తువునకొక తేజో బీజమై మాఘకావ్యాన్ని దివ్యంగా కొనసాగింపజేసింది.

## *ద్వ్యర్థి (రెండర్థాలతో గూడిన శ్లోకం) -*

ఈ క్రింది శ్లోకం కవి జేసిన వసంత ఋతువర్ణనము. రైవతక పర్వతప్రాంతంలో శ్రీకృష్ణుడు విహరించటం. మొదటగా, నవ అన్న పదం లో ఒక విశేషం ఉన్నది.

**నవపలాశపలాశవనం పురః స్ఫుటపరాగపరాగతపంకజమ్ ।**

**మృదులతాన్తలతాన్తమరూపయత్ స సురభిం సురభిం సుమనోభరైః ॥ (6§2)**

'కొత్త ఆకులు తొడగిన మోదుగు చెట్లు పూసి పుప్పొడిని వెదజల్లే తామరలూ, ఎండకు కొద్దిగా వాడిన కోమలమైన పల్లవాలు, పరిమళించే వివిధ రకాల పూలు సమృద్ధిగా నున్న వసంత ఋతువును శ్రీకృష్ణుడు చూశాడు.' ఇది ఈ శ్లోకానికి గల మొదటి అర్థం.

కష్టాలను కడతేర్చే శ్రీకృష్ణుణ్ణి షడృతువులు సైతము పత్ర పుష్ప ఫల తోయాల వంటి తమ తమ సామగ్రి తో సేవించటానికా అన్నట్టు, కాల నియమాన్ని గూడ విడిచి ఒక్క సారే ఆవిర్భవించాయట ! సేవించడంలో మాత్రం అవి క్రమాన్ని పాటించాయి. పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి - అని కదా గీతా వాక్యము. చిగురాకుల కోసం ముదురాకులు రాలిపోగా, మోదుగు మ్రోడులు మోయడం పృథివీస్థల ద్రవ్య శోభ, ఇంతకు ముందు మంచు తో కుంచించుకు పోయిన సరసిజాలు రేకులు విప్పడం జలద్రవ్య శోభ, తేమలేని గాలికి పరాగం (పొడి) తో వ్యాపించటం వాయుద్రవ్య శోభ. పల్లవమైన లతాదులు ఎరుపెక్కడం తేజో ద్రవ్య శోభ. దిగ్దిశల లో పరిమళం వ్యాపించడం ఆకాశ ద్రవ్య శోభ. వసంత ఋతువు ఈ పాంచమహాభౌతికాతాత్త్వక ద్రవ్య శోభలతో పరవశింప జేయడం - ఈ క్రొత్తందన ద్రవ్య శోభ ను మాఘ మహా కవి ఇక్కడ 'నవ' శబ్దం తో సూచించాడు. ఈ శ్లోకానికి రెండవ అర్థం ఉంది.

'పండితుల ప్రశంసలందుకొని పేరు పొందిన వాడూ, పాపాలవల్ల కలిగే దుఃఖానికి దూరంగా ఉన్న వాడూ, తపోనియమాలచే బక్క చిక్కిన భార్య తోగూడిన ఒక వానప్రస్థాశ్రమ సజ్జనుణ్ణి శ్రీకృష్ణుడు చూశాడు'. శ్రీకృష్ణుడు భోగియే కాదు, యోగి కూడాను. యోగులకు మనోబలం భోగులకు ద్రవ్యబలం కావాలి. రైవతకాద్రి పరిసర వనంలో విహరిస్తూ శ్రీకృష్ణుడు భోగదృష్టితో ఋతు శోభను , యోగదృష్టి తో తనను సేవించే సత్పురుషుణ్ణి తిలకించాడు. వనం అంటే అడవి, నివాసం. పంకం అంటే పంకిలం, అడుసు; సుమనస్ అంటే పుష్పం, పండితులు. సురభి అంటే పరిమళం, వసంతం, సజ్జనుడు అని నానార్థాలు.

## *ప్రకృతి సౌందర్యం* – ( 'నవ' శబ్దం మాఘ మహా కవికి ఎంతో ఇష్టమైన పదం; నవ అన్న పదానికి రెండర్థాలు– నవ అంటే తొమ్మిది, నవ అంటే క్రొత్త)

**దృష్టోఽపి శైల స్సముహుర్మురారేః  అపూర్వవద్ విస్మయమాతతాన ।**

**క్షణేక్షణే యన్నవతా ముపైతి  తదేవ రూపం రమణీయతాయాః ॥ (4§17)**

తా. ఎన్నిసార్లు చూసినా, రైవతక పర్వతం శ్రీకృష్ణునికి అపూర్వమైన, ‘*అపూర్వవద్*’ ఆశ్చర్యాన్ని పెంచుతూనే ఉంది. ప్రతి క్షణమూ ‘*క్షణేక్షణే*’ కొత్తదనం ‘*నవతా*’ గోచరింప జేసేదే కదా, సౌందర్యము. ఈ శ్లోకము కూడ, రైవతక పర్వత శోభని వర్ణిస్తోంది. రైవతక పర్వతం ఒక దివ్యసౌందర్యధామం. అందుకనే పరంధాముడైనా, *సః ముహుః మురారేః* మళ్ళీ మళ్ళీ చూడటం. దీంట్లో ఆశ్చర్య పడటం దేనికి ? కళ్ళార్పకుండా చూసినా, ‘*క్షణేక్షణే*’ కన్నుల రెప్పలు కప్పడం, విప్పడం – కాలవ్యవధి లక్షణం. చూసింది మళ్ళీ మళ్ళీ చూడాలనిపించటమే సౌందర్యానికి లక్షణం. *A thing of beauty is a joy forever !- John Keats*

***నిస్తాలవ్యములు -*** తాలవ్యములనగా దవడల సహాయంతో ఉచ్చరించ బడు వర్ణములు - ఇ, చ, ఛ, జ, ఝ, శ,  య. తదితరములు నిస్తాలవ్యములు.

**నామాక్షరాణాం మలనా మా భూత్భర్తురితి స్ఫుటమ్ ।**

**అగృహ్ణాన్త పరాంగానామసూనస్త్రం న మార్గణాః ॥ (19§110)**

తా. శ్రీకృష్ణుని నామాక్షరములెక్కడా మలినపడకుండునట్లుగా, ఆ భగవంతుడైన శ్రీకృష్ణుని బాణ పరంపరలు, శత్రువుల రక్తాన్ని అంటకుండా, శత్రువుల ప్రాణములను మాత్రము హరింప జేయుచున్నాయి .

***సర్వతోభద్రః ( ద్విఽఽయామ ప్రతిలోమానులోమ నిమ్నో పరిత ప్రక్రియ)*** - *(Bi-dimensional Symmetrical Palindrome)*

**సకారనా నారకాస కాయసాద దసాయకా ।**

**రసాహవా వాహసార నాదవాద దవాదనా ॥ (19§27)**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| స | కా | ర | నా | నా | ర | కా | స |
| కా | య | సా | ద | ద | సా | య | కా |
| ర | సా | హ | వా | వా | హ | సా | ర |
| నా | ద | వా | ద | ద | వా | ద | నా |
| నా | ద | వా | ద | ద | వా | ద | నా |
| ర | సా | హ | వా | వా | హ | సా | ర |
| కా | య | సా | ద | ద | సా | య | కా |
| స | కా | ర | నా | నా | ర | కా | స |

**[ a(i, j) = a(j, i) & a(i , j)=a(9-i, j) ] i=1,8;j=1,8**   **where { a(i,j)$_{(i=1;\ j=1,8)}$ is సకారనా నారకాస }**

సకార నానారకాస = అనేక విధములతో గూడిన శత్రు సమూహముల భ్రమణములు గల్గిన; కాయసాద దసాయకా = శరీరములకు అవసాదనమునిచ్చు నటువంటి; రసాహవా = నిర్భయముతో గూడిన యుద్ధమునందు; వాహ సార = వాహన శ్రేష్ఠముల యొక్క; నాదవాద ద = సకిలింపులను వినబడకుండు విధమున ఖండించు నటువంటి; వాదనా = తూర్యాది అధికతర మయిన శబ్దములతో ఆవరించినది యా రణ రంగము.

తా. ఆ రణరంగము అనేక విధములతోగూడిన శత్రు సమూహముల భ్రమణములు గల్గి శరీరమునకవసాదనము నిచ్చునటువంటి నిర్భయముతో గూడిన అశ్వముల సకిలింపులను ఖండింప జేయు తూర్యాది అధికతర శబ్దములతో అట్టహాసముగ నున్నది.

### *అర్థభ్రమకః* - *(Inverted Reflected Folded Symmetry)*

**అభీకమతికేనేద్ధే భీతాన న్దస్యనాశనే ।**

**కనత్సకామసేనాకే మన్దకామకమస్యతి ॥ (19§72)**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| అ | భీ | క | మ | తి | కే | నే | ద్ధే |
| భీ | తా | న | న్ద | స్య | నా | శ | నే |
| క | న | త్స | కా | మ | సే | నా | కే |
| మ | న్ద | కా | మ | క | మ | స్య | తి |

**[ $a(i, j) = a(j, i)$ & $b(i, j)=b(5-j, 5-i)$ ]$_{i=1,4; j=1,4}$** *where* **$\{a(i,j)_{(i=1; j=1,4)}$ is అభీకమ } { [ $b(i,j)]_{(i=1; j=1,4)}$ is తికేనేద్ధే }**

అభీకమతికేన ఇద్ధే = నిర్భయ చిత్తము కల్గిన భట సమూహము చేత ప్రకాశింపబడునటువంటి; భీతానన్దస్య నాశనే = పిరికి వాళ్ళ ఆనందాన్ని నాశనము జేసిడి; కనత్సకామ సేనాకే=సు సంపన్న మనోరథ చిత్తములతో ప్రకాశమాన మయినట్టి ఆ సైన్యము; మన్దకామకమస్యతి=శత్రువుల ఆశలను అడియాశల జేయుచున్నది.

తా. నిర్భయ చిత్తము కల్గిన భట సమూహము చేత ప్రకాశింపబడునటువంటి సు సంపన్న మనోరథ చిత్తములతో ప్రకాశమాన మయినట్టి ఆ సైన్యము పిరికి వాళ్ళ ఆనందాన్ని నాశనము జేయు రీతి శత్రువుల ఆశలను అడియాశల జేయుచున్నది.

### *ఏకాక్షర పాదః –*

**జజౌజోజాఽజిజిజ్జాజీ**
**తం తతోఽతితతాతితుత్ ।**
**భా భోఽభీభాభి భూభాభూ**
**రారారిరరిరీరరః ॥ (19§3)**

తా. అమితపరాక్రమశాలురైన యోద్ధులను మఱియు నిర్భీతమైన గజబలమును సైతము పరాజితులజేయగల భుజబల సంపన్నుడైన బలరాముడు రథారూఢుడై వేణుధారి అయిన శ్రీకృష్ణునితో యోద్ధుల జయించు నిమిత్తము, అత్యంత కాంతి యుతులై, స్వప్రకాశమానులై నక్షత్ర సదృశులవలె, రణ రంగమునందుఱికిరి.

### *ప్రతిలోమానులోమేన శ్లోకద్వయము–* (Note: The entire sloka # 34 is the palindrome of # 33)

**వాహనాజని మానాసే సారాజావనమా తతః ।**
**మత్తసారగరాజేభే భారీహావజ్జనధ్వని ॥ (19§33)**

**నిధ్వనజ్జవహారీభా భేజే రాగరసాత్తమః ।**
**తతమానవజారాసా సేనా మానిజనాహవా ॥ (19§34)**

తతః మానసే మత్త సారగ రాజేభే సారాజౌ భారీ హావ జ్జనధ్వనిః అనమా వాహనా అజని । తా. అటుపిమ్మట,శత్రువర్గంయొక్క బలాభిమానాలని ప్రతి ఘటించుతూసైనికబలాలు ఒకరినొకరు అమితోత్సాహంతో ఈ రణరంగంలో సింహగర్జన జేస్తూ వీరవిహారం చేస్తున్నారు.

నిధ్వనజ్జవహారీభా తతమానవ జారాసా మానిజనాహవా సేనా రాగరసాత్ తమః భేజే। తా. ఆ రణరంగము సర్వత్ర , వీరవిహారం చేస్తున్న మాన్య సైనికుల కలరవాలతో బాటు వారి వేగభరిత, భయంకర క్రోధ,విద్వేష, వీర రసాలతో గూడిన తమోంధకారంతో నిండియున్నది.

### *సముద్గయమకము–* (Note: Both the lines are repeated in this sloka, but do not mean the same, with a slight punctuation mark !).

**అయశోభిదురా లోకే కోపధా మరణాదృతే ।**

**అయశోభిదురాలోకే కోపధామరణాదృతే ॥ (19§58)**

తా. స్వామి కారణం గా అసమ్మానిత వీరుల యొక్క అపఖ్యాతి, స్వామి ద్వారా సంక్రమించిన అపకీర్తి అసత్కారములు యుద్ధంలో ప్రాప్తించిన వీరగతుల వల్లనే కదా! చెరిగి పోగలవు.

(సశేషము ... )